క్లుప్తంగా

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి



బెల్లంకొండ: మద్యం దుకాణాలలో ఎమ్మార్పీకి మాత్రమే మద్యాన్ని విక్రయించాలని క్రోసూరు ఎక్సైజ్ ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల పరిధిలో గల రెండు వైన్ షాపులను తనిఖీ చేశారు. దుకాణాలలో రికార్డులను పరిశీలించి, స్టాక్ చెక్ చేశారు. మద్యం షాపుల ముందు తప్పనిసరిగా ధరల పట్టికను ఉంచాలని తెలిపారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. గ్రామాలలో బెల్ట్ షాపులు ఏర్పాటుచేసినా, తెలంగాణ మద్యం, నాటు సారా వంటి విక్రయాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

31 లోపు సవరణ అర్జీలు ఇవ్వాలి



క్రోసూరు: 2024–25 సంవత్సర క్యాస్ట్ ఆడిట్ జాబితాలో హిందూ మాదిగ అని ఉంటేనే ఎస్సీలుగా పరిణించటం జరుగుతుందని, కాబట్టి అభ్యంతరాలుంటే ఈనెల 31 లోపు సవరణ అర్జీలు ఇవ్వాలని క్రోసూరు ఎమ్మార్పీఎస్ శాఖ ప్రతినిధి కొడవటి కృపాకర్ మాదిగ శనివారం తెలిపారు. క్రోసూరు సచివాలయం –1 లో సోషల్ వెల్ఫేర్ అధికారి నుంచి క్యాస్ట్ ఆడిట్ 2024–25 సంబంధించిన జాబితా తీసుకోవడం జరిగిందన్నారు. అందులో మాదిగ క్రిస్టియన్, క్రిస్టియన్ మాదిగ అని ఉందని అలా ఉంటే బీసీ 'సి' కిందకు వస్తారని, ఎస్సీలుగా పరిగణించటం జరగదని తెలిపారు. కావున అభ్యంతరాలున్న ఎస్సీ సోదరులు సవరణ అర్జీలు అందచేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నందిగం దేవదాస్, గార్లపాటి దాసు పాల్గొన్నారు.

రాగితీగ, మోటారు చోరీ



పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామంలోని రైతులు కంచేటి రామకృష్ణ, సయ్యద్ మస్తాన్ వలికి చెందిన విద్యుత్ టాన్స్‌ఫార్మర్లలోని రాగితీగ దొంగతనానికి గురైనట్లు శనివారం విద్యుత్ శాఖ ఏఈ బసవరాజుకు ఫిర్యాదు అందింది. ఈనెల 25వ తేదీ పొలానికి వెళ్లగా తమకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగ, నీటి మోటారు దొంగతనానికి గురైనట్లు గుర్తించామని తెలిపారు. విద్యుత్ ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావు పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి ఉందని తెలిపారు. దీంతో రూ.10 వేలు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. ఎస్ఐ కె.నాగేంద్రరావుకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

అమరావతిలో సీపీఐ శతవార్షికోత్సవ సభ



అమరావతి: పేదలకు అండగా నిలిచి, వారి సమస్యలపరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక అమరావతి పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ శతవార్షికోత్సవాలు నిర్వహించారు. ఈసభకు పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ళ నాగేశ్వరావు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం పార్లమెంటు, అసెంబ్లీలలో సీపీఐ పాత్ర గణనీయంగా పెరిగిందన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, సీపీఐ పల్నాడు జిల్లా ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ బడ్జెట్ సమావేశం ఈనెల 30న సాయంత్రం 4 గంటలకు కౌన్సిల్ హాల్లో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి శనివారం తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. సవరించిన బడ్జెట్ అంచనాలపై చర్చించి ఆమోదించటం జరుగు తుందన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని కోరారు.

అడుగుకో గుంత.. తీరేనా చింత!

- రోడ్లను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- గుంతల మయంగా మండలంలోని రహదారులు
- పట్టించుకోని అధికారులు

సత్తెనపల్లి మండలంలోని గోరంట్ల గ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడు ఈ ఏడాది జూలై 4వ తేదీన తన ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వైపు వెళుతూ గోళ్లపాడు గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై మధ్యలో ఉన్న గుంత కనిపించక కింద పడ్డాడు. తల, కుడి కాలుకు తీవ్రగాయాలై ఆసుపత్రి పాలయ్యాడు. అదేవిధంగా ఇదే రహదారిపై నాలుగో మైలు సమీపంలో ఉన్న గుంతను గమనించక ఇటీవల మోపెడ్‌పై వెళుతున్న దంపతులు గాయాలపాలయ్యారు.



ముప్పాళ్ల-దమ్మాలపాడు రహదారిపై మట్టి కొట్టుకుపోయి రాళ్లు తేలిన దృశ్యం



గోళ్లపాడు చప్టాపై ఏర్పడిన గుంత



సత్తెనపల్లి-నరసరావుపేట రహదారిపై నాలుగో మైలు వద్ద ప్రమాదకరంగా గుంత



జీబీసీ కాల్వ వద్ద దెబ్బతిన్న రోడ్డు

ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కొక్క హామీని విస్మరిస్తూనే ఉంది. కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆరు నెలలు గడిచినా కొత్త రోడ్లు నిర్మాణాలు చేపట్టక పోగా, రహదారులపై ఉన్న గుంతలకు కూడా మరమ్మతులు సైతం చేయటం లేదు. మండలంలోని ప్రధాన రహదారులన్నీ గుంతల మయంగానే మారాయి. ప్రధానంగా సత్తెనపల్లి-నరసరావుపేట 20 కిలో మీటర్ల ప్రధాన రహదారిపై ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియడం లేదు. రోడ్డు పై వచ్చే వారు ఆదమరిస్తే ప్రమాదానికి గురి కావాల్సిందే. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇరుకుపాలెం గ్రామం నుంచి మాదల సెంటర్‌లోను, బొల్లవరం అడ్డరోడ్డు వద్ద, గుంటూరు బ్రాంచి కాలువ వద్ద ఏర్పడిన గుంతలు వాహనదారులను ఇబ్బందుల పాలుచేస్తున్నాయి.

రహదారిపై నాల్గవ మైలు మలుపు వద్ద ఏర్పడిన గుంత మరింత ప్రమాదకరంగా మారింది. గోళ్ళపాడు దాటాక లోలెవల్ చప్టా పైన, చివరన ఏర్పడిన గుంతలు భారీ వాహనాలను సైతం ఎదురుగా మరో వాహనం వస్తే నిలుపుకోవాల్సిన దుస్థితి.

అంతర్గత రహదారులు సైతం...

మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారిపోయాయి. రహదారుల వెంబడి ముళ్లకంప మొలిచి కొమ్మలు రోడ్డుపైకి వచ్చి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. రాత్రిళ్లు ప్రయాణం చేయటం ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. ముప్పాళ్ల నుంచి తురకపాలెం మీదుగా దమ్మాలపాడు వెళ్లే రహదారి వర్షానికి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డా పట్టించుకునే వారు లేరు. మాదల నుంచి తొండపి వైపు వెళ్లే రహదారి, దమ్మాలపాడు నుంచి తొండపి వెళ్లే రహదారిపై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రహదారుల గుండా రైతులు పొలాలకు వెళ్లేందుకు నానా యాతన పడాల్సి వస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్లను పరిశీలించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంటోంది..



సత్తెనపల్లి నుంచి మాదల వరకు ఉన్న ప్రధాన రహదారిపై గుంతలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుపై పెద్ద గాడిలాగా ఉండి టైర్ అందులో పడగానే బండి అదుపు తప్పి పక్కకు పోతుంది. రాత్రిళ్ల ప్రయాణం చేయటం భయంగా ఉంటోంది.

–బొడ్డేటి జయరావు, మాదల

రోడ్డు మధ్యలో గుంతలతో ప్రమాదాలు



రహదారిపై మధ్యలో లోతుగా గుంతలు పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై ఎక్కడ ఏ గుంత ఉందో తెలియడం లేదు. రోడ్డుపై అవగాహన ఉన్నవారు తప్ప కొత్తవారు ప్రయాణిస్తే ఖచ్చితంగా ప్రమాదాల బారిన పడతారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులైనా చేపడితే కొంత మంది ప్రాణాలు కాపాడిన వారవుతారు.

–అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, చాగంటివారిపాలెం

మరమ్మతులు చేపడతాం

సత్తెనపల్లి-నరసరావుపేట ప్రధాన రహదారి మరమ్మతులను త్వరలో చేపడతాం. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో గల రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవలే రహదారిపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ జరిగింది. ముప్పాళ్ళ నుంచి నార్నెపాడు వరకు గల రహదారి మరమ్మతులు కూడా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

– బి.జగదీష్, ఏఈఈ, రోడ్లు భవనాల శాఖ, సత్తెనపల్లి

రేపటి గ్రీవెన్స్ రద్దు

క్రోసూరు: ఈనెల 30 వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక రద్దు అయినట్లు డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలోని యలమంద గ్రామం పర్యటిస్తున్నందున గ్రీవెన్స్ రద్దు అయినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల సత్తా



క్రోసూరు: ఈనెల 24వ తేదీన జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన 37వ నేషనల్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో (సబ్ జూనియర్ లెవల్ సాఫ్ట్‌బాల్) అంతరాష్ట్ర పోటీల్లో క్రోసూరు సెయింట్ ఆన్స్ విద్యార్థులు తనూజ, చందనలు ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన ఇద్దరు క్రీడాకారులకు రాష్ట్ర స్పోర్ట్ అథారిటీ రజత పతకం, షీల్డ్‌లు అందించిందన్నారు. దీంతోపాటుగా రూ.1,25,000 క్యాష్ ప్రైజ్ త్వరలో ప్రభుత్వం తరపున అందుతుందని వారు తెలియచేసినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. అదేవిధంగా విజయవాడ స్వర్ణప్యాలెస్‌లో ఈనెల27న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆముదాలవలస ఎమ్మెల్యే కోనా రవికుమార్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ సీఈఓ వెంకటేశ్వర్లు, సెక్రటరీ నాగేంద్ర, ట్రెజరర్ నరసింహారెడ్డి పాల్గొని క్రీడాకారులను అభినందించినట్లు చెప్పారు.

ఎంపీడీఓపై దాడి అమానుషం

పెదకూరపాడు: అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపీడీఓ జోహార్ బాబు పై పలువురు దాడి చేసి గాయపరచటం అమానుషం అని పెదకూరపాడు ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. పెదకూరపాడు మండల పరిషత్ సిబ్బందితో కలిసి ఆయన శనివారం నిరసన తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేడుకగా శ్రీవారికి ధనుర్మాస పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి దేవాలయాల్లో శ్రీవారికి వేడుకగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వడ్డవల్లి రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శ్రీవారిని వేణుగోపాలస్వామిగా అలంకరించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని దివ్య సమ్మోహన రూప అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్డవల్లిలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై పాశురాలు పటించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



రైల్వేస్టేషన్ రోడ్‌లో దివ్య సమ్మోహన రూప అలంకారంలో శ్రీవారు



పట్టణంలోని వడ్డవల్లిలో పాశురాలు పటిస్తున్న మహిళలు

కళాకారులకు డప్పులు వితరణ

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు గ్రామానికి చెందిన డప్పు కళాకారులకు గ్రామ సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, ఆమె భర్త వెంకట్రావు సుమారు రూ.25వేలు విలువచేసే డప్పులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన సంవత్సరం, సాంప్రదాయం పండుగులలో ప్రధానమైన సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని తనవంతుగా కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో అన్నివర్గాలవారికి మేలు జరిగిందన్నారు. ఇలాంటి ప్రోత్సాహాలు గతంలో ప్రభుత్వం ద్వారా లభించేవన్నారు. కళలపట్ల తనకు ఉన్న మక్కువతో కులవృత్తులద్వారా ఆదాయవనరులను పెంపొందించుకునేందుకు, డప్పులు ఇస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ నాయకుడు దేవరశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ యాంపొంగు దాసు, చిట్యాల దావీదు, పాతూరి ఆదాం, యాంపొంగు అబ్రహం, పాతూరి దానియేలు, బోరుపోతు వినోద్, సత్తెమ్మతల్లి దేవస్థానం మాజీ చైర్మన్ గుడారి గోపియాదవ్, కొరివి వెంకటనరేష్ యాదవ్, బోధ గంగరాజు, చిట్టిపోతుల వెంకట్రావు, కంబాల తిరుపతి రావు, మునగాల హనుమంతరావు పాల్గొన్నారు.



డప్పు కళాకారులతో మాదా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సత్తెనపల్లి: దీర్ఘకాలికంగా పరిష్కారం కానీ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ కెఎస్ చక్రవర్తి అన్నారు. సత్తెనపల్లి మండలం, ఫణిదం గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ చక్రవర్తి మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు యాజమాన్య హక్కు పత్రాలతో అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని కోరారు. మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ బోసుబాబు, దేవాదాయ శాఖ అధికారి రామకోటి రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, ప్రజలు, పాల్గొన్నారు.

లంకెలకూరపాడులో...

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు శనివారం జరిగింది. సదస్సులో తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 62 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. 30 అర్జీలు నూతన పింఛన్‌ల కోసం, 30 అర్జీలు రేషన్‌కార్డుల కోసం, రెండు అర్జీలు రెవెన్యూకు సంబంధించి అందాయన్నారు. మండల సర్వేయర్ టి.సుధాకర్, వీఆర్వో సుమతి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ కె.పుల్లారావు చెప్పారు. నకరికల్లులోని సచివాలయం-1, సచివాలయం-2లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. నకరికల్లులోని రెండు సచివాలయాల పరిధిలో మొత్తం 12 అర్జీలు వచ్చాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, ఇన్‌చార్జి పురుషోత్తం, పి.శారద, రైతులు పాల్గొన్నారు.

హుస్సేన్ నగరంలో...

పెదకూరపాడు: మండలంలోని హుస్సేన్ నగరం గ్రామంలో శనివారం తహసీల్దార్ మీసాల దానియేలు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ ఎస్టీ కాలనీలో దానియేలు పర్యటించి, కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఫణిదంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చక్రవర్తి

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెదకూరపాడు: ఇంట్లో రాత్రి సమయంలో భోజనం చేస్తున్న వ్యక్తిపై మూకుమ్మడి దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని బలుసుపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు గిరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బలుసుపాడు గ్రామంలో ఈనెల 26వ తేదీన గ్రామానికి చెందిన మంటి గిరిబాబు రాత్రి పది గంటల సమయంలో తన ఇంట్లో భోజనం చేస్తుండగా ఇదే గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు, సాయి,గోపి, తిరుపతిరావు, శ్రీను, దాసు అనే వ్యక్తులు వచ్చి ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేసి కత్తులతో దాడి చేస్తుండగా బాబు బిగ్గరగా కేకలు వేయటంతో నిందితులు పరారైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిలకలూరిపేట: పట్టణ పరిధిలో పనిచేసే వివిధ చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించి, ధృవీకరణ పత్రాలు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు తెలి పారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ,గీజర్, టీవీ మెకానిక్‌లు,బ్యూటీషియన్లుతో పాటు అన్ని రకాల సేవలు అందించే వారికి శిక్షణ అందించి సర్టిఫికేట్లు అందజేస్తామన్నారు. దీంతో పాటు హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం ద్వారా జీవనోపాధి కల్పించబడుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీ లోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేయాలన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి

సత్తెనపల్లి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పాటుపడుతుందని అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు అన్నారు. ఏపీ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి మణిరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్న షేక్ ఖాశిం బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిట్టిబాబు వచ్చారు. ఇరువురిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే అసోసియేషన్‌కు నూతనంగా మహిళా ఉపాధ్యక్షురాలి స్థానం కేటాయించడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని పీపీ యూనిట్‌లో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న ఎస్.కుసుమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుసుమను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అసోసియేషన్ సెక్రటరీ ఎస్.అంబేడ్కర్, ట్రెజరర్ కోటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ రవిచంద్ర కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎస్.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



స్టాఫ్ నర్స్ కుసుమను సత్కరిస్తున్న మణిరావు, అసోసియేషన్ బాధ్యులు

దివ్యాంగులకు చేయూతనందించాలి

సత్తెనపల్లి: పుట్టుకతోనే చెవిటి, మూగ, మానసిక వికలాంగులుగా జన్మించిన చిన్నారులకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాల్సిన అవసరం ఉందని అభ్యుదయ విజ్ఞాన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని పరివర్తన మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో శనివారం బ్యాంగ్ బ్రోస్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ పుట్టుకతోనే మానసిక వికలాంగులుగా జన్మించిన చిన్నారులను దైవసమానులుగా భావించాలన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావును బ్యాంగ్ బ్రోస్ మిత్ర బృందం ప్రత్యేకంగా అభినందించింది. బ్యాంగ్ బ్రోస్ ప్రతినిధులు షేక్ సలాం, షేక్ జాకీర్, మద్ది భాస్కర్, వి.శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు భవిరిశెట్టి శ్రీనివా సరావు, భవిరిరిశెట్టి సుబ్రహ్మణ్యం, తొమండ్రు సురేష్, చేగు మోహన్ రావు, చిలకల శ్రీనివాసరావు, అద్దంకి శ్రీనివాసాచారి, డి.సాంబశివరావు, కిలాన అక్కయ్య నాయుడు పాల్గొన్నారు.



పరివర్తనలో మానసిక వికలాంగులకు అల్పాహారం అందిస్తున్న మల్లిఖార్జునరావు, మిత్ర బృందం

నిజమైన హక్కుదారులను ఇబ్బంది పెడుతున్నారు

సత్తెనపల్లి: అధికారులకు తప్పుడు సమాచారం అందిస్తూ నిజమైన స్థలం హక్కుదారులను కట్టమూరి విజయ వెంకటలక్ష్మీ నరసింహారావు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పరుచూరి కృష్ణారావు వెంచర్ ప్లాట్ల హక్కుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లో సర్వే నెంబర్ 332-2లోని భూముల సర్వే కొలతలకు జిల్లా సర్వేయర్ భాను కీర్తి శనివారం రావడంతో ఆమె ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. సర్వే నెంబర్ 332-2 లో మొత్తం 6.90 ఎకరాలు భూమి ఉండగా అందులో 5.20 ఎకరాలు 2002లో పరుచూరి కృష్ణారావు, తుమురుకోటి ప్రేమయ్యకు వారసుల నుంచి రిజిస్టర్ ద్వారా కొనుగోలు చేసి ప్లాట్లు వేసి అనేక మందికి విక్రయించారు. మిగిలిన 1.70 ఎకరాలను శ్రీసనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంకు 1966లో కట్టమూరి నరిసింహం రిజిస్టర్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ ద్వారా 332-2 కొలతలు వేయాలని కట్టమూరి విజయ వెంకట లక్ష్మీనరసింహారావు దరఖాస్తు చేయడంతో జిల్లా సర్వేయర్ వచ్చారు. జిల్లా సర్వేయర్‌కు హక్కు దారులు తమ దస్తావేజులు, లింక్ డాక్యూమెంట్లను అందించగా సర్వే కోసం వచ్చిన నరసింహారావు ఎటువంటి దస్తావేజులు చూపించలేదు. 332-2 సర్వే నెంబర్ లోని హక్కుదారులకు నోటీసులు ఇవ్వకపోడం గుర్తించిన జిల్లా సర్వేయర్ భాను కీర్తి రెవెన్యూ రికార్డులలో ఉన్న వారందరికీ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా ఇంకా సర్వే కొరకు దరఖాస్తు చేసుకునే వారుంటే వారందరికీ ఒక తేదీ నిర్ణయించి ఆర్డీఓతో కలసి సర్వే నిర్వహించి స్థలంలో వాస్తవంగా ఉన్నవారికి పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇస్తామన్నారు. ఆమె వెంట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానిక రెవెన్యూ అధికారులు, పట్టణ, మండల సర్వేయర్‌లు, వీఆర్వోలు ఉన్నారు.



న్యాయం చేయాలని డాక్యుమెంట్లు చూపుతున్న స్థలం హక్కుదారులు

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కనపర్రు స్కూలుకు హెచ్‌బీఎల్ చేయూత



నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి హెచ్‌బీఎల్ కంపెనీ అందిస్తున్న చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదివి రాణించాలని హెచ్ఎం రాజ్యలక్ష్మీ చెప్పారు. కనపర్రు బీపీఆర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎండీ ఏజే ప్రసాద్, మేనేజర్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రేవతి శనివారం నోటుపుస్తకాలు, పెన్నులు, చార్టులు, కుర్చీలు, ఇనుప బీరువాను పాఠశాలకు అందించారు. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సరిపడా విద్యా సామగ్రిని అందించారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి, మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం మానవతా దృక్పధంతో ఈ పరిసరాల్లోని ప్రాథమిక పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నదన్నారు. ఉపాధ్యాయులు శైలజ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.